## క్లుప్తంగా

### ఎరువుల దుకాణం తనిఖీ



నగరం: విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి వేమూరి రమేష్‌బాబు చెప్పారు. పెదపల్లి గ్రామంలోని ఎరువుల దుకాణాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విత్తనాలను లైసెన్స్ ఉన్న డీలర్ వద్దే కొనుగోలు చేయాలని, సంబంధిత బిల్లు తీసుకుని భద్రపరుచుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ యోజనకు సంబంధించి ఈ నెల 31వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. తనిఖీలో ఏఈవో నాగ శ్రీనివాస రావు, వీఏఏలు ఉన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

కర్లపాలెం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీఓ దాసరి రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరవుతారని పేర్కొన్నారు.

### నేడు ఖాజీపాలెంలో జగనన్న సురక్ష శిబిరం

కర్లపాలెం: పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలోని రాజ్యలక్ష్మి కల్యాణ మండపంలో శనివారం జగనన్న సురక్ష శిబిరం జరుగుతుందని గ్రామ సర్పంచ్ కె.అనూష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు.

### జూనియర్ అసిస్టెంట్ నివాస గృహంలో చోరీ

మంగళగిరి: ఏపీ మహిళా కమిషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి నివాస గృహంలో చోరీ జరిగింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధి కాజకు చెందిన తోకల హరిబాబు ఏపీ మహిళా కమిషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం 10 గంటలకు డ్యూటీకి బయలుదేరి వెళ్లిన హరిబాబు అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. తలుపులకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండటంతో గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని సుమారు 10 గ్రాముల బంగారం, నగదు మాయమైంది. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సీఎం జగన్ చిత్రపటానికి పండితుల ఆశీర్వచనం

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్చకులకు వరాల జల్లు కురిపించడంతో ఆయన చిత్రపటానికి ప్రత్యేక ఆశీర్వాదాలు అందజేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం సీతాభవనంలో శుక్రవారం అర్చకులు సమావేశం నిర్వహించారు. పలువురు అర్చకులు మాట్లాడుతూ అర్చకులకు వంశపారంపర్యం హక్కులు కల్పించి జీతాలు పెంచి అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి కానీ అర్చకులను, వారి బాధలను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. గతంలో పలు ఆలయాలు ధూప, దీప, నైవేద్యాలకు నోచుకోలేదని, అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16 వేల దేవాలయాల్లో ధూప, దీప నైవేద్యాలు ఏర్పాటు చేసేందుకు 16 వేల మంది అర్చకులను ఏర్పాటు చేశారని, నిధులు కేటాయించారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకులకు పెద్దపీట వేశారని, జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క బ్రాహ్మణ వర్గానికే కాకుండా అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్, నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు కె.రాఘవాచార్యులు, రాజరాజేశ్వరి దేవస్థానం అర్చకులు కె.రాధాకృష్ణమూర్తి, సీతానగరం శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానం అర్చకులు శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఐదో తరగతి విద్యార్థి అదృశ్యం



మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని కాజకు చెందిన ఐదో తరగతి విద్యార్థి అదృశ్యమయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కాజ పుల్లయ్యనగర్‌కు చెందిన షేక్ కరీముల్లా, జరీనా దంపతుల కుమారుడు ఫిరోజ్ (12) ప్రతి రోజూ మాదిరి గురువారం ఉదయం స్కూలుకు వెళ్లి సాయంత్రం ఐదు గంటలకు తిరిగి ఇంటికి వచ్చాడు. స్నేహితులతో కలసి ఆటలాడుకునేందుకు బయటకు వెళ్లిన ఫిరోజ్ తిరిగి ఇంటికి రాలేదు. తల్లి జరీనా తన కుమారుడు ఫిరోజ్ అదృశ్యమైనట్లు మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జగనన్నతోనే పేదల అభివృద్ధి

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- పండుగలా 'జగనన్న సురక్ష' శిబిరాలు



మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోన ఘుపతి

బాపట్ల అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. శుక్రవారం బాపట్ల పట్టణంలోని శ్రీనివాసనగర్, బెస్తపాలెం సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని, మాట్లాడారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. శ్రీనివాసనగర్ సచివాలయ పరిధిలో మొత్తం 112 దరఖాస్తులు రాగా 1,060 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అలాగే బెస్తపాలెం సచివాలయ పరిధిలో 677 దరఖాస్తులు రాగా 677 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చింతల రాజశేఖర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, జోగి రాజా, మున్సిపాలిటీ సర్వేయర్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

**'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు**

రేపల్లె: ప్రజలకు సులభతరంగా వారికి అవసరమైన సర్టిఫికెట్లను, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని మండల ఉపాధ్యక్షురాలు రావు నెహ్రూలక్ష్మి అన్నారు. పేటేరు పంచాయతీలోని సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. గ్రామంలో 600 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను ఎంపీడీవో శివపార్వతి, సర్పంచ్ కనపర్తి వసుమతి, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకర రావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవి కిరణ్ అందజేశారు. పెనుమూడిలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో తహసీల్దారు మల్లికార్జునరావు, సర్పంచ్ దారం విజయ్, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు 584 మందికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. పట్టణంలో 9, 11 వార్డులకు జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, టీకేవీ గుప్త, కౌన్సిలర్ బొలిశెట్టి సత్యనారాయణ, కమిషనర్ విజయసారథి పాల్గొని, ధ్రువ పత్రాలు అందజేశారు.



పెనుమూడిలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న తహసీల్దారు మల్లికార్జునరావు, సర్పంచ్ విజయ్

**జగనన్న సురక్ష.. ప్రజలకు ఎంతో మేలు**

చెరుకుపల్లి: 'జగనన్న సురక్ష' ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మండల పరిషత్ అధ్యక్షుడు మత్తి దివాకర రత్నప్రసాద్ అన్నారు. కావూరులో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, తూర్పుపాలెంలో తహసీల్దారు బి.వెంకటేశ్వర్లు శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. తూర్పుపాలెం శిబిరానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం వివిధ ధ్రువీకరణ పత్రాలను అర్జీదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చెల్లి జ్యోతి, తూము రమాదేవి అధికారులు పాల్గొన్నారు.

**వినూత్న మార్పునకు శ్రీకారం**

పెదలంక/గొరిగపూడి(భట్టిప్రోలు): 'జగనన్న సురక్ష'తో వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. పెదలంక, గొరిగపూడి సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. పెదలంక సచివాలయం పరిధిలో 1,464, గొరిగపూడి సచివాలయం పరిధిలో 899 వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమాల్లో సర్పంచులు గుమ్మడి శంకరరావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, గరికపాటి మల్లి, ఎంపీటీసీ సభ్యులు సన్నెపాముల చంటి, వరికూటి పున్నయ్య, తహసీల్దారు డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, జగనన్న సురక్ష మండల ప్రత్యేక అధికారి వినోద్, ఈవోపీఆర్డీ టి. ఊహారాణి, పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



గొరిగపూడిలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖరరావు

## ఇతర రాష్ట్రాలకు ఆదర్శం..నవరత్నాలు

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- నిజాంపట్నంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

నిజాంపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న 'నవరత్నాలు' ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. నిజాంపట్నంలోని సచివాలయం–1 పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడారు. పాదయాత్ర ద్వారా వేల కిలోమీటర్లు నడిచి, నేరుగా ప్రజల కష్టాలను చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబం మేలు జరిగి ఆర్థికంగా బలపడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎంతమేర లబ్ధి చేకూరింది అనే వివరాలను ఆ కుటుంబ పెద్దకు వివరించారు. స్థానిక మహిళలు తమ బజారులో సీసీ రోడ్డు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఎంపీ దృష్టికి తెచ్చారు. త్వరలోనే రోడ్డు వేస్తామని మోపిదేవి వారికి హామీ ఇచ్చారు. అదేవిధంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, యార్లగడ్డ మదన్‌మోహన్, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మహిళకు అందిన సంక్షేమ లబ్ధిని తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి

## అభివృద్ధి పనుల్లో డ్వాక్రా సంఘాలు భాగస్వాములు కావాలి

చెరుకుపల్లి: గ్రామాల్లో జల జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో డ్వాక్రా సంఘాల మహిళలు భాగస్వాములై కాంట్రాక్టు పనులు చేసుకోవచ్చని బాపట్ల జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు. నడింపల్లి గ్రామంలో జలజీవన్ పథకం ద్వారా జరిగే మంచి నీటి ట్యాంకు, పైప్‌లైన్ తదితర అభివృద్ధి పనులపై శుక్రవారం డ్వాక్రా సంఘ మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసాగర్ మాట్లాడారు. డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా మరింత స్థిరపడేందుకు ఇటువంటి పనులు ఎంతగానో దోహదపడతాయన్నారు, అనంతరం డ్వాక్రా సంఘల మహిళల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏవీఎల్ ప్రసాద్, ఏఈ జి.అనూష, జలజీవన్ జిల్లా మేనేజర్ పి.కిరణ్‌కుమార్, ఏపీఎం వెంకటేశ్వర్లు, డ్వాక్రా సంఘ జిల్లా అధ్యక్షురాలు ద్రాక్షవలి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ సీహెచ్ విద్యాసాగర్

## నిరాశ్రయులకు సహృదయ ఫౌండేషన్ చేయూత

బాపట్ల అర్బన్: తీర ప్రాంతం సూర్యలంక దగ్గర ఉన్న గిరిజన కుటుంబాలకు శుక్రవారం సహృదయ ఫౌండేషన్ ప్రతినిధులు రూ.22వేలు విలువ చేసే.. బియ్యం, నిత్యావసర సరుకులను 18 కుటుంబాలకు శుక్రవారం పంపిణీ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ గూడు కోల్పోయిన గిరిజనులను ఆదుకున్న ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ కె.శరత్, సీపీఎం సీనియర్ నాయకులు ఎన్. కోటేశ్వరావు, నాగేశ్వరావు, మహిళా సంఘం (ఐద్వా) నాయకురాలు టి. సుభాషిని, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.ఆర్య, నాయకులు రవి పాల్గొన్నారు.

## త్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు అభినందన

నిజాంపట్నం: తమ పాఠశాల విద్యార్థులు త్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో వారిని ప్రధానోపాధ్యాయురాలు జి.గీతావాణి శుక్రవారం అభినందించారు. చింకపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మెహజాబీన్ బేగ్, టి.దివ్య నూజివీడు త్రిపుల్ ఐటీ సీట్లు సాధించారని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పెదపులివర్రు విద్యార్థి ఎంపిక**

భట్టిప్రోలు: త్రిపుల్ ఐటీలో మండలం నుంచి నలుగురు విద్యార్థులు సీట్లు సాధించారు. పెదపులివర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బడుగు జశ్వంత్ కుమార్ జనరల్ క్యాటగిరిలో నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. జశ్వంత్ కుమార్‌ను ప్రధానోపాధ్యాయులు షేక్ మహ్మద్ సుభాని, ఉపాధ్యాయులు అభినందించి, స్వీట్స్ తినిపించారు. భట్టిప్రోలు సిద్దార్థ హైస్కూల్‌కు చెందిన కుందేటి అంజని, బొందలపాటి శ్రీలక్ష్మి ఒంగోలులో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. కరస్పాండెంట్ వేల్పూరి నాగేశ్వరరావు, హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## కౌలు రైతు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

కొల్లిపర: కౌలు రైతులు తప్పని సరిగా ప్రభుత్వం అందిస్తున్న కౌలురైతు గుర్తింపు కార్డు తీసుకోవాలి అప్పుడే ప్రభుత్వం కౌలు రైతులకు అందిస్తున్న పథకాలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి అధ్యక్షతన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ డ్రిప్ పరికరాలను 90 శాతం రాయితీ ఇవ్వాలని, వ్యవసాయ పనిముట్లు గ్రూపులకు కాకుండా ఇన్‌డివిడ్యువల్‌గా ఇవ్వాలని, ఎటువంటి ఆంక్షలు లేకుండా మండలంలోనే పసుపు కొనుగోలు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు తెలిపిన ప్రతి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి, రైతులకు మేలు జరిగేలా కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏ ఉషారాణి, ఏఓ కె.వెంకటరావు, తహసీల్దారు జి.నాంచారయ్య, ఎంపీడీఓ చంద్రమోహన్, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయశాఖ అధికారులు

### శాకంబరీదేవిగా గుండెపాటమ్మ



రేపల్లె రూరల్: పేటేరు గ్రామదేవత శ్రీ మహాలక్ష్మి గుండెపాటెమ్మ అమ్మవారు శాకంబరీదేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, పసుపు, కుంకుమలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సుమంత్ అమ్మవారికి పట్టువస్త్రాలు, కూరగాయలతో శాకంబరీదేవిగా ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలు, సద్ది నైవేద్యాలు, కూరగాయలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఫ్రెషర్స్ డే జోష్..

బాపట్ల అర్బన్: బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు, మొదటి సంవత్సరం విద్యార్థినులకు స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అన్ని ఒడిదుడుకులు ఎదుర్కొని సంపూర్ణ పట్టభద్రులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి. విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



వేదికపై నృత్యం చేస్తున్న విద్యార్థినులు

## వరి నాటుకు వేళాయె





రేపల్లె: నైరుతీ రుతుపవనాలతో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో రేపల్లె నియోజకవర్గంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు పొలం పనుల్లో తీరికలేకుండా ఉన్నారు. రేపల్లె మండలంలో సాధారణ వ్యవసాయ భూమి 10,386 హెక్టర్లు, నగరం మండలంలో 10,719 హెక్టార్లు, చెరుకుపల్లి మండలంంలో 7,692 హెక్టర్లు, నిజాంపట్నం మండలంలో 5,262 హెక్టర్లు ఉంది. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో పాటు సకాలంలో సాగు నీరు అందుతుండటంతో సకాలంలో వరినాట్లు పూర్తయ్యి... పంట చేతికొస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## వృద్ధులు, యాచకులకు అన్నదానం

చేబ్రోలు: పొన్నూరులో శుక్రవారం పలువురు వృద్ధులు, యాచకులకు అన్నదానం చేసినట్లు కేవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాట్రగడ్డ విజయకుమార్ తెలిపారు. విజయవాడ వారి ఆర్థిక సాయంతో పొన్నూరులోని అమ్మ సేవా నిలయంతో పాటు కసుకర్రు గ్రామంలోని 12 మంది వృద్ధులకు, నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో 25 మంది యాచకులకు, అనాథలకు అన్నదానం చేసినట్లు ట్రస్టు చైర్మన్ తెలిపారు. దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు నూర్ భాషా అల్లా బక్షు పాల్గొన్నారు.

### వైభవంగా ఆడికృత్తిక మహోత్సవాలు

తెనాలిటౌన్: రూరల్ మండలం పెదరావూరులో మహా విద్యాపీఠంలో శ్రీ అభయహస్త సుబ్రమణ్య స్వామివారికి ఆడికృత్తిక మహోత్సవంలో భాగంగా స్వామికి విశేష పూజలు జరిపారు. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మహావిద్యాపీఠం నిర్వాహకులు సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ ఆడికృత్తిక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



మహా విద్యాపీఠంలో పూజలు చేస్తున్న స్వామీజీలు

### ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేత



భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్‌లో రెండేళ్ల నుంచి ఎన్‌సీసీలో శిక్షణ పొందిన 20 మంది బాలికలకు ఎన్‌సీసీ 'ఎ' సర్టిఫికెట్లు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి 26 మంది బాలికలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గుంటూరు 10(ఎ) బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ–పీఐ స్టాఫ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, గ్రేడ్–1 ఆఫీసర్ కేపీఎల్ పార్వతీ పాల్గొన్నారు.

## పోతురాజుస్వామి కొలుపులకు నగదు విరాళం

కర్లపాలెం: మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న పోతురాజుస్వామి కొలుపులలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, గాదె మధుసూదనరెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం పోతురాజుస్వామి కొలుపులకు గాను గాదె మధుసూదనరెడ్డి గ్రామపెద్దలకు రూ.50వేల నగదు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కల్లం హరనాథ్‌రెడ్డి, సమ్మెటవారిపాలెం సర్పంచ్ పిట్టు నాగాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామపెద్దలకు నగదు అందజేసిన మధుసూదనరెడ్డి, గోవర్ధనరెడ్డి

## ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలి

కొల్లిపర: ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసినప్పుడే పాఠశాలకు మంచి పేరు వస్తుందని, తద్వారా ఉపాధ్యాయులతోపాటు మండలానికి , ఎంఈఓలకు కూడా మంచి పేరు వస్తుందని ఆ దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మండల విద్యాశాఖాధికారి 1 సాల్మాన్‌రాజు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నూతనంగా ఎంఈఓలుగా విధుల్లో చేరిన వారికి సత్కారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంఈఓ లక్ష్మీనారాయణ పాల్గొని ఉపాధ్యాయులకు పలుసూచనలు సలహాలు అందజేశారు. అనంతరం నూతన ఎంఈఓ1 సాల్మన్‌రాజు, ఎంఈఓ 2 ఝాన్సీలత కలిసి మాజీ ఎంఈఓ లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో 2 ఝాన్సీలత మాట్లాడుతూ విద్యార్థులకు కనీస అభ్యస్థాయి ఉండేలా టీచర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎం .రమేష్ , సీఆర్‌పిలు రమేష్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు సన్మానం

నగరం: మండలంలోని పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధానోపాధ్యాయుడు కె.బదిరీనారాయణ మాట్లాడారు. 11 సంవత్సరాలుగా పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసిన వి.శ్రీనివాసరావు, ఆంగ్ల ఉపాధ్యాయుడు వి.వెంకటేశ్వరావు సేవలను కొనియాడారు. ఇద్దరినీ దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు నెహ్రూ, రమేష్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

### ఆరని నిరసన జ్వాల

కొల్లూరు: సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడంలో కీలకంగా ఉన్న వలంటీర్ వ్యవస్థను కించపరుస్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం దోనేపూడి సచివాలయం పరిధిలోని వలంటీర్లు స్థానిక సెంటరులో నిరసన ప్రదర్శన చేపట్టారు. పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు వెనిగళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

## శాకంబరిగా ఎన్నాడమ్మ దర్శనం

ఖాజీపాలెం(కర్లపాలెం): శాకంబరీ దేవిగా ఎన్నాడమ్మ శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలోని ఎన్నాడమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా పలు రకాల పండ్లు, కూరగాయలతో శాకంబరి అలంకరణ చేశారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి సారె సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.



శాకంబరిగా ఎన్నాడమ్మ